జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ‖సంపుటి:1 ‖ సంచిక: 103‖ సోమవారం ‖ 7-9-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

07 సెప్టెంబర్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:06 సూర్యాస్తమయం - సా. 6:21 తిథి ఏకాదశి సా. 5:05 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం పునర్వసు సా. 6:12 వరకు తరువాత పుష్యమి యోగం వ్యతిపాత ఉ. 6:35 వరకు కరణం బవ ఉ. 6:16 వరకు భాలవ సా. 5:05 వరకు వర్జ్యం ఉ. 7:03 నుండి ఉ. 8:32 వరకు దుర్ముహూర్తం మ. 12:38 నుండి మ. 1:27 వరకు మ. 3:05 నుండి మ. 3:54 వరకు రాహుకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:10 వరకు యమగండం ఉ. 10:42 నుండి మ. 12:14 వరకు గుళికాకాలం మ. 1:46 నుండి మ. 3:17 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:30 నుండి తె. 5:18 వరకు అమృత ఘడియలు మ. 3:59 నుండి సా. 5:29 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:38 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్
# రాజీనామా చేయాలి

ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంగా కాంగ్రెస్ ముందుకు సాగుతోందని వెల్లడి

అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్నారని విమర్శ

రెండు సంవత్సరాల్లో భారీ పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలు కల్పించామని స్పష్టం

కుల సర్వేతో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని మహేష్ గౌడ్ వ్యాఖ్య

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష నాయకుడి పదవి అత్యంత బాధ్యతాయుతమైనదని, అలాంటి హోదాలో ఉన్న వ్యక్తి ప్రజల సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 6: ప్రజా సమస్యలపై స్పందించకుండా ప్రతిపక్ష నాయకుడి హోదాను అపహాస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, ఆ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల, సన్నబియ్యం పంపిణీతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజలకు చేరువవుతున్నామని -2 వ పేజీలో..

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన
# అట్టర్ ఫ్లాప్



ఎర్రవల్లిలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం

అసెంబ్లీ వ్యూహాలపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపు

జలాలు, రైతు సమస్యలపై పోరాటం ఉధృతం చేయాలని సూచన

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఆయన అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

సిద్దిపేట, సెప్టెంబర్ 6: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ప్రజా సమస్యలపై మరింత దూకుడుగా పోరాడాలని కేసీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ తరువాయి 2 వ పేజీలో..



## ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

పెండింగ్ డీఏల విడుదలపై దృష్టి

పెన్షనర్లకు ప్రయోజనం కలిగే నిర్ణయాలు: హోం మంత్రి అనిత

అమరావతి, సెప్టెంబర్ 6, (రుద్రన్యూస్): ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్ర ప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. 2



# 22ఏ సమస్య సీఎం సమీక్ష

## సమస్య ఎందుకొచ్చిందంటూ ఆరా

హైదరాబాద్,

భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పలు భూ సంబంధిత సమస్యలపై ముఖ్యమంత్రి ఆరా తీసినట్లు సమాచారం. ఈ సందర్భంగా నిషేధిత జాబితా అంశంపైనా ఆయన అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. "గతంలో ఎప్పుడూ ఈ సమస్య లేదు కదా.. 22ఏ వివాదంగా మారడానికి అసలు కారణాలు ఏంటి' అని సీఎం ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ వివరాలు తెలియజేసినట్లు తెలిసింది. 22ఏ సమస్యలు ఎప్పటి నుంచో ఉన్నాయని పేర్కొంటూ.. నిషేధిత భూముల జాబితాను అప్‌డేట్ చేయాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే గతేడాది చివర్లో జిల్లా కలెక్టర్లు సంతకాలు చేసిన ప్రతులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారని పేర్కొన్నారు.

ఎక్కడెక్కడ సమస్యలు ఉత్పన్నమయ్యాయి.. ఏ మేరకు పరిష్కరించామనే వివరాలను కూడా ఆయన సీఎంకు తెలిపారు. హైదరాబాద్ పరిసర జిల్లాల్లోనే సమస్య కనిపించిందని.. వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరించినట్లు వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. భూ సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలంటూ సీఎంవో ముఖ్య (మిగతా 2వ పేజీలో)

# బీజేపీలోకి చేరికలు

రాష్ట్ర పార్టీ కార్యాలయంలో చేరిక కార్యక్రమం

మోదీ వికసిత్ భారత్ దార్శనికతకు ఆకర్షితులై చేరిక

హైదరాబాద్, సెప్టెంబర్ 6: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలకు చెందిన నాయకులు పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ విధానాలకు ఆకర్షితులై బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాట్లాడిన ఎన్. రామచందర్ రావు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న (మిగతా 2వ పేజీలో)



# భవిష్యత్ సాంకేతికతల కీలక కేంద్రంగా తెలంగాణ

## పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైదరాబాద్,

రాబోయే రోజుల్లో అధునాతన ఫొటోనిక్ ప్యాకేజింగ్, కో-ప్యాకేజ్డ్ ఆప్టిక్స్ లాంటి భవిష్యత్ తరం సాంకేతికతల్లో తెలంగాణను కీలక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈమేరకు నిపుణులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలతో కలిసి సమగ్ర కార్యచరణ ప్రణాళికను రూపొందించడంపై దృష్టి సారించామన్నారు. సచివాలయంలో ఆదివారం నీతి అయోగ్ (మిగతా 2వ పేజీలో)



## మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన
# చర్యలు తీసుకోవాలి

2

బంజారాహిల్స్‌లో మీడియాతో మాట్లాడిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

సోషల్ మీడియా ట్రోలింగ్‌పై డీజీపీ వైఖరిని ప్రశ్నించిన కవిత

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలని ముఖ్యమంత్రిని కోరిన టీఆర్ఎస్ అధినేత్రి



- ఆత్మకూరులో ఆటో కార్మికుల సమావేశం
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హాజరు
- రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్

వనపర్తి, సెప్టెంబర్ 6,

వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ఆటో కార్మికుల సమస్యలపై నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ (మిగతా 2వ పేజీలో)

# ఆటో కార్మికుల హామీలు అమలు చేయాలి

# నేటి రాశి ఫలాలు

**మేషం:** బంధువులతో వివాదాలు పరిష్కారమవుతాయి. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి. ఆర్థిక లావాదేవీలు నిరాశ పరుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు నిరాశ పరుస్తాయి. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించాలి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు.

**వృషభం:** వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు తప్పవు. కుటుంబ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. ధన పరంగా ఇతరులకు మాట ఇచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఋణదాతల నుండి ఒత్తిడులు అధికమవుతాయి. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది.

**మిధునం:** మొండి బాకీలు వసూలు చేసుకుంటారు. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. రాజకీయ ప్రముఖుల నుండి సభ, సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి.

**కర్కాటకం:** ఉద్యోగాలలో ఆశించిన పదవులు పొందగలుగుతారు. అవసరానికి కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపార పరంగా తీసుకున్న నిర్ణయాలు అనుకూల ఫలితాలనిస్తాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. సంతాన వివాహ విషయమై చర్చలు ఫలిస్తాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

**సింహం:** వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చేయటం మంచిది. సన్నిహితులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఉంటాయి.పెద్దల ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. దూరప్రయాణాలు వాయిదా పడతాయి.

**కన్య:** విద్యార్థులకు ఒత్తిడులు తప్పవు. చేపట్టిన పనుల్లో తొందరపాటు నిర్ణయాలు చేయటం మంచిది కాదు. వ్యాపారాలు అంతంతమాత్రంగా సాగుతాయి. ఉద్యోగపరంగా అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు కొంత నిరుత్సాహపరుస్తాయి.

**తుల:** వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. గృహమున కొన్ని ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. విందు వినోదాది కార్యక్రమాలకు హాజరు అవుతారు.

**వృశ్చికం:** చేపట్టిన పనుల్లో ఆటంకాలు తప్పవు. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. బంధుమిత్రుల నుంచి కొన్ని పనులలో ఒత్తిడి అధికమవుతుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు.

**ధనస్సు:** ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో ఒత్తిడి నుండి బయట పడతారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది.

**మకరం:** వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. సన్నిహితులతో మాటపట్టింపులు తప్పవు. కుటుంబ విషయాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. నిరుద్యోగుల యత్నాలు ముందుకు సాగవు. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆరోగ్యపరంగా కొంత జాగ్రత్త అవసరం.

**కుంభం:** ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. సమాజంలో ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.

**మీనం:** కొన్ని వ్యవహారాలలో ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. విందు వినోద కార్యక్రమాలకు హాజరవుతారు.



# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్ ఫ్లాప్

(మొదటి పేజీ తరువాయి)

అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వేదికలను రాజకీయ ఆరోపణలకు ఉపయోగించడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులు, సాగునీటి సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేసీఆర్ ఆరోపించారు. కృష్ణా, గోదావరి జలాల అంశంపై బీఆర్ఎస్ సభ్యులు ఉధృతంగా పోరాడాలని సూచించారు. రైతులకు అవసరమైన సాగునీరు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ అంశాన్ని అసెంబ్లీలో బలంగా ప్రస్తావించాలని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం వైఖరిని ప్రజల ముందుంచాలని పిలుపునిచ్చారు. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి వంటి కీలక ప్రాజెక్టుల నిర్వహణపై కూడా కేసీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించడం లేదని ఆరోపించారు. ప్రాజెక్టుల పనితీరు, నీటి వినియోగం, సాగునీటి పంపిణీ అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

# భవిష్యత్ సాంకేతికతల కీలక కేంద్రంగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

సభ్యుడు డా.వీకే సారస్వత్‌తో శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు. సిలికాన్ ఫొటోనిక్స్ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చు కొనేలా 'తెలంగాణ సిలికాన్ ఫొటోనిక్స్ మిషన్'కు దశలవారీ వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడంపై చర్చించారు. ఫొటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ భవిష్యత్ కార్యాచరణ, ఇండియా సెమీకండక్టర్ మిషన్–2.0తో 'తెలంగాణ సిలికాన్ ఫొటోనిక్స్ మిషన్'ను అనుసంధానించేందుకు ఉన్న అవకాశాలపై సమీక్షించారు. త్వరలో ఏర్పాటు చేయనున్న 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ క్వాంటమ్ కంప్యూటింగ్'లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని సారస్వత్‌ను శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. ఫొటోనిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే అడ్వైజరీ కౌన్సిల్‌కు నేతృత్వం వహించాలని కోరారు. ఫొటోనిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ లాంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని సారస్వత్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఫొటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ సీఈవో ఏఎస్ రమేశ్ పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల హామీలు అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నప్పటికీ ఆటో కార్మికుల సంక్షేమానికి సంబంధించిన కీలక హామీలు అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెరుగుతున్న జీవన వ్యయాల మధ్య ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆటో కార్మికుల కుటుంబాల ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల కార్మికుల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆటో కార్మికుల సంక్షేమానికి సంబంధించిన హామీల అమలుపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారు కోరారు.

# బీజేపీలోకి చేరికలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో వివిధ వర్గాలకు చెందిన నాయకులు బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. దేశాభివృద్ధి, జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు బీజేపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన అన్నారు. "నేషన్ ఫస్ట్" అనే సిద్ధాంతాన్ని పార్టీ ప్రధాన మార్గదర్శకంగా తీసుకుని పనిచేస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను అన్నింటికంటే ముందుగా ఉంచే రాజకీయ సంస్కృతిని బీజేపీ ప్రోత్సహిస్తోందని చెప్పారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలని రామచందర్ రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయడంలో కొత్తగా చేరినవారు కీలక పాత్ర పోషించాలని అన్నారు. తెలంగాణలో బీజేపీ రోజురోజుకు బలపడుతోందని, ప్రజల మద్దతు పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు అవకాశాలు, రైతుల సంక్షేమం, మహిళల సాధికారత వంటి అంశాలపై పార్టీ ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు రాష్ట్ర అధ్యక్షుడు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు దేశాభివృద్ధి లక్ష్యాల సాధనకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు పాల్గొని కొత్త సభ్యులను స్వాగతించారు.

# ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

రాష్ట్ర అభివృ ద్ధిలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న ఆమె, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఉద్యోగులకు న్యాయమైన హక్కులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) అమలు ద్వారా ఉద్యోగుల వేతనాల్లో పెరుగుదల కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులకు తగిన ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉద్యోగుల ఆర్థిక స్థితి మెరుగుపడేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేసే దిశగా కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదురుచూస్తున్న అంశాలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోందని చెప్పారు. పెన్షనర్ల సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం ముఖ్యంగా పరిగణనలోకి తీసుకుంటోందని మంత్రి వెల్లడించారు. పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించేలా పలు చర్యలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగ జీవితమంతా రాష్ట్ర సేవలో పనిచేసిన వారికి గౌరవప్రదమైన జీవనం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే విధానాలు అమలవుతున్నాయని వంగలపూడి అనిత పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలంటే ఉద్యోగుల్లో భద్రత, నమ్మకం ఉండాలని చెప్పారు. ఉద్యోగుల సేవలను ప్రభుత్వం ఎప్పటికీ గౌరవిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి కొనియాడారు. వారి సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ అంశాలను కూడా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని ఆమె అన్నారు.



# కేసీఆర్ రాజీనామా చేయాలి

మొదటి పేజీ తరువాయి

చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.

గత బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి చివరకు నిరాశపరిచారని ఆయన ఆరోపించారు. ఇళ్లు లేని పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. వైద్య రంగాన్ని కూడా గత ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థకే పరిమితం చేసిందని విమర్శించారు. విద్యతో పాటు సంస్కారం కూడా అవసరమని కేటీఆర్‌కు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో లక్షా 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా మరో ఐదు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించామని తెలిపారు. రానున్న రెండున్నర సంవత్సరాల్లో మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబానికే ఉద్యోగాలు వచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం ఇప్పటికే 70 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించామని అన్నారు. కుల సర్వే నిర్వహణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల నేతృత్వంలో కుల సర్వే నిర్వహించామని తెలిపారు. గద్దర్, అందెశ్రీ వంటి ఉద్యమకారులను గత ప్రభుత్వం విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గద్దర్ పేరిట అవార్డులు ఏర్పాటు చేసి గౌరవించిందని చెప్పారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించి సామాజిక న్యాయానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చాటిందన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడం ప్రతిపక్షాల హక్కేనని, కానీ అసత్య ప్రచారాలు చేయడం సమంజసం కాదని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రతిపక్షాలు తప్పులు ఎత్తిచూపితే సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుందనే పూర్తి విశ్వాసం తమకు ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# 22ఏ సమస్య సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి శేషాద్రిని ఆదేశించారు. సమావేశానికి పలువురు కలెక్టర్లు హాజరయ్యారు. నిషేధిత భూముల జాబితా అంశం శాసనసభ సమావేశాల్లో చర్చకు రానున్న నేపథ్యంలో దీనిపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ భూముల సమగ్ర వివరాలను ఈ వేదికగా ప్రజలకు వెల్లడించేందుకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిద్ధమయ్యారు. హైకోర్టు ఆదేశాలతో 2025 చివర్లో జాబితాలను రిజిస్ట్రేషన్ల శాఖ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ క్రమంలో కొన్ని ప్రైవేటు ఆస్తులు కూడా ఆ జాబితాలో ఉన్నాయంటూ ప్రతిపక్షాలు ప్రశ్నిస్తూ వస్తున్నాయి. పాత జాబితాలో ఏ వివరాలు ఉన్నాయి, కొత్తగా అప్‌లోడ్ చేసిన జాబితాలో ఉన్న వివరాలు ఏంటనేది సభలో మంత్రి వివరించనున్నట్లు తెలిసింది. ఆదివారం ఈ అంశాలపై మంత్రి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో సుదీర్ఘ సమీక్ష చేశారు. 22ఏ జాబితాను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత.. ఆ జాబితాలో ఉన్నాయంటూ పలుచోట్ల భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్లు తిరస్కరించారు. ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఇలాంటివి వెలుగు చూశాయి. బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా.. 980 వచ్చాయి. వీటి పరిష్కారానికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల కార్యదర్శులతో ప్రభుత్వం హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో శాసనసభలో విపక్షాల నుంచి వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు రెవెన్యూ శాఖ సన్నద్ధమైంది. సభ్యులు 22ఏ సంబంధిత ప్రశ్నలు వేస్తే వాటికి సరైన జవాబు అందించే విధంగా జిల్లాల వారీగా పూర్తి సమాచారాన్ని తెప్పించింది. రాష్ట్రంలో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు హక్కులు లేని రైతులకు ఇటీవల పట్టాలు పంపిణీ చేశారు. ఇదే తరహాలో ఇతర జిల్లాల్లో కూడా ఏళ్ల తరబడి హక్కులు రాని భూముల వివరాలను సిద్ధం చేసి సర్వే చేపట్టాలని కూడా రెవెన్యూ శాఖను మంత్రి ఆదేశించినట్లు సమాచారం.

# మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**బంజారాహిల్స్‌లో మీడియాతో మాట్లాడిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత**

హైదరాబాద్, సెప్టెంబర్ 6, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న సోషల్ మీడియా దూషణలు, ట్రోలింగ్ ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఇప్పటివరకు తగిన చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యల పై కఠిన చర్యలు తీసుకోవడానికి చట్టాలు ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళల భద్రత విషయంలో పోలీసులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సోషల్ మీడియా వేదికల్లో మహిళలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ట్రోలింగ్‌లు ఆందోళనకర స్థాయి కి చేరుకున్నాయని కవిత అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న మహిళలపైనే ఇలాంటి దాడులు జరుగుతుంటే సాధారణ మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలో చించాలని పేర్కొన్నారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని చట్టాలు స్పష్టంగా చెబుతున్నాయని, అయినప్పటికీ అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపిం చారు. చట్టాలను అమలు చేయడంలో అధికారులు మరింత చురుకుదనం ప్రదర్శించాలని సూచించారు.

# శ్వేత

## సంపాదకీయం

**సోమవారం 7-9-2026**

# సరిహద్దులు దాటే నేరాలకు సమిష్టి పోరాటం అవసరం

ప్రపంచం నేడు ఒక గ్రామంగా మారిపోయింది. రవాణా, సమాచార సాంకేతికత, అంతర్జాతీయ వాణిజ్యం అభివృద్ధి చెందడంతో దేశాల మధ్య దూరాలు తగ్గిపోయాయి. అయితే ఇదే పరిస్థితిని నేరస్థులు కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఒక దేశంలో నేరం చేసి మరొక దేశంలో తలదాచుకోవడం, అంతర్జాతీయ ఆర్థిక మోసాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు వంటి కార్యకలాపాలు సరిహద్దులను దాటి విస్తరిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్క దేశం మాత్రమే నేరాలను అరికట్టడం సాధ్యం కాదు. అందుకే అంతర్జాతీయ పోలీసు సహకారం కాలానుగుణ అవసరంగా మారింది. ఈ నేపథ్యంలో జరుపుకునే అంతర్జాతీయ పోలీసు సహకార దినోత్సవం ప్రపంచ భద్రత కోసం సమిష్టి కృషి ఎంత ముఖ్యమో గుర్తు చేస్తోంది.

గతంలో నేరాలు ఎక్కువగా ఒక ప్రాంతం లేదా ఒక దేశానికి మాత్రమే పరిమితమయ్యేవి. కానీ ప్రస్తుతం నేరాల స్వరూపం పూర్తిగా మారిపోయింది. అంతర్జాతీయ నేర ముఠాలు అనేక దేశాల్లో తమ వలలను విస్తరించాయి. నకిలీ కరెన్సీ, మానవ అక్రమ రవాణా, ఆన్‌లైన్ మోసాలు, ఆయుధాల అక్రమ వ్యాపారం వంటి నేరాలు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. వీటిని అరికట్టాలంటే వివిధ దేశాల పోలీసు సంస్థలు పరస్పరం సమాచారాన్ని పంచుకోవడం, సంయుక్త దర్యాప్తులు నిర్వహించడం, నేరస్థులను గుర్తించి పట్టుకోవడంలో సమన్వయం చేసుకోవడం అత్యవసరం. అంతర్జాతీయ సహకారం లేకుండా ఈ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడం అసాధ్యం.

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి ఒకవైపు మన జీవితాలను సులభతరం చేస్తుండగా, మరోవైపు కొత్త రకాల నేరాలకు కూడా అవకాశం కల్పిస్తోంది. ముఖ్యంగా సైబర్ నేరాలు ప్రపంచ దేశాలకు పెద్ద సవాలుగా మారాయి. ఒక దేశంలో కూర్చొని మరొక దేశంలోని వ్యక్తుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయడం, కీలక సమాచారాన్ని దొంగిలించడం, ప్రభుత్వ వ్యవస్థలపై దాడులు చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. ఈ తరహా నేరాలను అరికట్టాలంటే సాంకేతిక నైపుణ్యంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో సమాచార మార్పిడి కూడా అవసరం. పోలీసు వ్యవస్థలు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

ఉగ్రవాదం ప్రపంచ శాంతి, భద్రతలకు అతిపెద్ద ముప్పుగా కొనసాగుతోంది. ఉగ్రవాద సంస్థలు తమ కార్యకలాపాలను అనేక దేశాలకు విస్తరించడమే కాకుండా ఆధునిక సాంకేతికతను కూడా వినియోగిస్తున్నాయి. ఉగ్రవాదులకు నిధులు అందించే వలయాలు, ఆయుధాల సరఫరా మార్గాలు, శిక్షణా కేంద్రాలు అనేక దేశాల్లో విస్తరించి ఉండటం వల్ల వాటిని గుర్తించడం క్లిష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో వివిధ దేశాల పోలీసు, నిఘా సంస్థల మధ్య సమన్వయం అత్యంత కీలకం. సమాచారాన్ని వేగంగా పంచుకోవడం ద్వారా అనేక ఉగ్రదాడులను ముందుగానే అడ్డుకోవడం సాధ్యమవుతోంది.

అంతర్జాతీయ పోలీసు సహకారంలో సమాచార మార్పిడి అత్యంత ప్రధానమైన అంశం. నేరస్థుల వివరాలు, వేలిముద్రలు, ఆర్థిక లావాదేవీలు, ప్రయాణ వివరాలు వంటి సమాచారం వేగంగా అందుబాటులోకి వస్తే దర్యాప్తు మరింత సమర్థవంతంగా సాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ప్రత్యేక సహకార వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని నేరాల నియంత్రణలో భాగస్వామ్యం అవుతున్నాయి. నేరస్థులు సరిహద్దులను దాటి తప్పించుకునే అవకాశాలను తగ్గించడంలో ఈ విధానం కీలకంగా మారింది. సమయానికి సమాచారం అందితే అనేక నేరాలను ముందుగానే అరికట్టవచ్చు. ప్రపంచ భద్రతను కాపాడడంలో పోలీసు వ్యవస్థల పాత్ర అత్యంత కీలకమైనది. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించడం మాత్రమే కాకుండా చట్టబద్ధమైన సమాజ నిర్మాణంలో కూడా పోలీసుల బాధ్యత అపారమైనది. అంతర్జాతీయ సహకారం పెరగడం వల్ల వివిధ దేశాల పోలీసులు తమ అనుభవాలను పంచుకోవడానికి, కొత్త దర్యాప్తు పద్ధతులను నేర్చుకోవడానికి అవకాశం లభిస్తోంది. ఇది వారి సామర్థ్యాన్ని మరింత పెంచుతోంది. ఒక దేశం సాధించిన విజయాలను మరో దేశం కూడా అమలు చేసే అవకాశం ఏర్పడుతోంది.

అభివృద్ధి చెందుతున్న దేశాలు అంతర్జాతీయ నేరాల నియంత్రణలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. సాంకేతిక వనరుల కొరత, శిక్షణ లోపం, పరిమిత మౌలిక సదుపాయాలు వంటి సమస్యలు ఉన్నాయి. అయితే అంతర్జాతీయ సహకారం ద్వారా ఈ దేశాలు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, నిపుణుల సహాయాన్ని పొందగలుగుతున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడంలో సహాయపడుతోంది. ఏ దేశం బలహీనంగా ఉన్నా అది ప్రపంచ భద్రతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పోలీసు సహకారం కేవలం నేరస్థులను పట్టుకోవడానికే పరిమితం కాదు. ప్రకృతి వైపరీత్యాలు, మానవతా సంక్షోభాలు, భారీ అంతర్జాతీయ కార్యక్రమాల భద్రత వంటి అంశాల్లో కూడా పరస్పర సహకారం ఎంతో ఉపయోగపడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో ఒక దేశం మరో దేశానికి సాంకేతిక సహాయం, నిపుణుల సహకారం అందించడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చు. ఈ సహకారం ప్రపంచ దేశాల మధ్య విశ్వాసాన్ని కూడా పెంచుతుంది.

ప్రపంచం ఎదుర్కొంటున్న నేరాలు, భద్రతా సవాళ్లు రోజురోజుకూ సంక్లిష్టంగా మారుతున్నాయి. ఈ సమస్యలను ఒక్క దేశం లేదా ఒక్క సంస్థ పరిష్కరించలేరు. సమన్వయం, సమాచార మార్పిడి, పరస్పర విశ్వాసం, సాంకేతిక సహకారం వంటి అంశాలు కలిసొచ్చినప్పుడే సమర్థవంతమైన ఫలితాలు సాధ్యమవుతాయి. అందుకే అంతర్జాతీయ పోలీసు సహకారం భవిష్యత్తులో మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ పోలీసు సహకార దినోత్సవం ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని అందిస్తోంది. నేరాలకు సరిహద్దులు లేకపోతే వాటిని ఎదుర్కొనే పోరాటానికీ సరిహద్దులు ఉండకూడదు. ప్రపంచ శాంతి, భద్రత, న్యాయం కోసం అన్ని దేశాలు కలిసి పనిచేసినప్పుడే సురక్షితమైన భవిష్యత్తును నిర్మించగలం. అంతర్జాతీయ సహకారమే నేటి ప్రపంచానికి అత్యంత ప్రభావవంతమైన భద్రతా ఆయుధం.



# ప్రకృతి ఆధారిత ఉత్పత్తులకు వేదికగా నేచర్లింక్

### ముసాఫిబ్రల్ ఆధ్వర్యంలో నేచర్లింక్ స్టోర్ ప్రారంభం

విజయవాడ, సెప్టెంబర్ 6:

ప్రకృతి అనుకూలమైన, పర్యావరణ హితమైన ఉత్పత్తులను ప్రజలకు అందించడంతో పాటు గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో ముసాఫిబ్రల్ (Musafibral) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన Natureling -- Your Natural Lifestyle Destination స్టోర్‌ను విజయవాడలో ఘనంగా ప్రారంభించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏపీ హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ ఎం. వెంకటేశ్వర్లు గారు, ఏపీ టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీమతి నాయుడు గారు, జిల్లా టూరిజం అధికారి డా. కొల్లేటి రమేష్ గారు ముఖ్య అతిథులుగా హాజరై చీఫ్‌బతీవశ్రీఅఅన స్టోర్‌ను ప్రారంభించారు.

అలాగే హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన శ్రీ శ్రీధర్ బాబు గారు, శ్రీ వెంకట్ రెడ్డి గారు, కృష్ణా హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీమతి జ్యోతి గారు కార్యక్రమంలో పాల్గొని నేచర్లింక్‌కు తమ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఏపీ హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ ఎం. వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ, ముసాఫిబ్రల్ మరియు చీఫ్‌బతీవశ్రీఅఅన వ్యవస్థాపకులు శ్రీ పి. శ్రీనివాసులు గారు, శ్రీమతి చి. ఆనందకుమారి గారు ప్రకృతి ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించడం అభినందనీయమని అన్నారు. ముసాఫిబ్రల్, చీఫ్‌బతీవశ్రీఅఅన అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని, వారి ఉత్పత్తులను జాతీయ స్థాయితో పాటు ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ చేసే దిశగా ప్రోత్సహించేందుకు సహకరిస్తామని తెలిపారు.

Natureling ప్రత్యేకత

Natureling -- Your Natural Lifestyle Destination అనేది ప్రకృతి, సంప్రదాయం, సుస్థిర జీవన విధానాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రత్యేకమైన బ్రాండ్. అరటి, వెదురు, వాటర్ హయసింత్, సిసల్, జనపనార (జూట్), కొబ్బరి వంటి సహజ ఫైబర్లతో తయారు చేసిన హ్యాండ్‌మేడ్ పేపర్, బుట్టలు, బ్యాగులు, మ్యాట్స్, రోప్స్, హ్యాండీక్రాఫ్ట్స్, గృహోపకరణాలు, సహజ ఫైబర్ ఉత్పత్తులు మరియు పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయ ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంటాయి.

ప్రకృతి వనరులను వృథా చేయకుండా వాటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం చీఫ్‌బతీవశ్రీఅఅన ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా అరటి పంటలో మిగిలిపోయే కాండం, వ్యర్థ పదార్థాల నుంచి ఫైబర్‌ను సేకరించి వివిధ విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా రైతులకు, గ్రామీణ మహిళలకు అదనపు ఆదాయ అవకాశాలను కల్పించేందుకు సంస్థ కృషి చేస్తోంది.

ముసాఫిబ్రల్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు సహజ ఫైబర్ ఆధారిత ఉత్పత్తుల తయారీలో శిక్షణ అందిస్తూ, వారి నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మార్చేందుకు కృషి చేస్తోంది. ఈ కార్యక్రమాల ద్వారా మహిళా సాధికారతతో పాటు స్థానిక వనరులు -- స్థానిక నైపుణ్యాలు -- ప్రపంచ మార్కెట్ అనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

భవిష్యత్తులో చీఫ్‌బతీవశ్రీఅఅన ఉత్పత్తులను మరింత విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, భారతీయ సహజ ఫైబర్ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమని సంస్థ వ్యవస్థాపకులు తెలిపారు.

"ప్రకృతితో అనుసంధానం... సంప్రదాయంతో సృష్టి... గ్రామీణ మహిళలతో సాధికారత... ప్రపంచ మార్కెట్‌కు సహజ ఉత్పత్తులు" అనే ఆలోచనతో Natureling ముందుకు సాగుతోంది.

# 7న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### లిజిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

జిల్లా ప్రజల సమస్యలకు వేగవంతమైన, పారదర్శకమైన పరిష్కారం అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. దీనిలో భాగంగా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సెప్టెంబర్ 7 సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా ఈ వేదిక ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించే సమయంలో పేరు, పూర్తి చిరునామా, మొబైల్ నంబర్‌తో పాటు సమస్యకు సంబంధించిన సమగ్ర వివరాలను స్పష్టంగా పొందుపరచాలని కలెక్టర్ సూచించారు. సమస్యకు సంబంధించిన ఆధార పత్రాలు, ఇతర సంబంధిత డాక్యుమెంట్లను అర్జీతో పాటు జతచేయాలని తెలిపారు. ఇప్పటికే ఇదే సమస్యపై గతంలో ఫిర్యాదు చేసిన వారు తమ పాత అర్జీ రశీదు/ఫిర్యాదు రసీదును వెంట తీసుకురావాలని సూచించారు. దీనివల్ల పాత ఫిర్యాదు వివరాలను పరిశీలించి, తదుపరి చర్యలను వేగంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ అర్జీల స్థితిగతులను సులభంగా తెలుసుకునేలా ప్రభుత్వం ఎస్ఎంఎస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదు పరిష్కార ప్రక్రియకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌కు వ్యక్తిగతంగా హాజరై అర్జీ సమర్పించలేని ప్రజలు కూడా తమ సమస్యలను అధికారుల దృష్టికి



తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న 1100 టోల్‌ఫ్రీ కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఎవవనశీఝఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా తమ ఫిర్యాదులను నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అర్జీల స్వీకరణ ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు డివిజన్, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. తమ ప్రాంతానికి సమీపంలోని సంబంధిత కార్యాలయాలను ప్రజలు సంప్రదించి సమస్యలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆధార పత్రాలతో అర్జీలు సమర్పించడం ద్వారా వాటిని త్వరితగతిన పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పాలన వైఫల్యాలకు నిదర్శనం: బాల్క సుమన్

మంచిర్యాల, సెప్టెంబర్ 6, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ బాల్క సుమన్ విమర్శించారు. క్యాతనపల్లిలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మిర్యాల రాజిరెడ్డి, టీజీబీకేఎస్ నాయకులతో కలిసి మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పాలన మొత్తం దగా, వైఫల్యాలు, అన్ని వర్గాల విధ్వంసానికి నిదర్శనంగా మారిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ 33 నెలల పాలనలో రాష్ట్రంలో కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదని బాల్క సుమన్ అన్నారు. కనీసం ఒక ఇటుక కూడా పేర్చలేని పరిస్థితి నెలకొన్నప్పటికీ రాష్ట్రంపై రూ.4 లక్షల కోట్లకు పైగా అప్పుల భారం మోపారని ఆరోపించారు. అభివృద్ధి పనులు చేపట్టకుండా అప్పులు పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. ప్రజలకు ప్రయోజనం చేకూరే కార్యక్రమాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు.





# దశాబ్దాల వంతెన కలను నిజం చేస్తూ నిర్మాణానికి శ్రీకారం

**మర్రివలస ప్రజల హర్షధ్వానాల మధ్య శంకుస్థాపన**

**ఎన్నికల హామీ నెరవేర్చటం పట్ల సంతోషం**

**6 కోట్ల 50 లక్షల రూపాయలతో వంతెన నిర్మాణం**

**10 లక్షలతో నిర్మించిన పంచాయితీ భవనం ప్రారంభం**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు**

గజపతినగరం, సెప్టెంబర్ 6, మండలంలోని మర్రివలస ప్రజల దశాబ్దాల వంతెన కలను నిజం చేస్తూ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఆంధ్ర ఆర్ & బి రోడ్డు నుండి మర్రివలస వరకు 6 కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టబోయే రోడ్డు మరియు వంతెన నిర్మాణానికి మర్రి వలస ప్రజల హర్షధ్వానాల మధ్య ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. 10 లక్షల రూపాయలతో నిర్మించిన మర్రివలస గ్రామ పంచాయితీ భవనాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానం మేరకు మర్రివలస ప్రజల చిరకాల వాంఛ అయిన వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉ ందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఆధ్వర్యంలో నాటి శాసనసభ్యులు డాక్టర్ కే ఏ నాయుడు గారి ఆధ్వర్యంలో గతంలోనే చంపావతి ప్రవహించే కొనిస, పట్రువాడ, మరివలస గ్రామాల రాకపోకల నిమిత్తం వంతెనల నిర్మాణానికి నాంది పలకడం జరిగిందన్నారు. అందులో భాగంగానే యువ నాయకులు నారా లోకేష్ కొనిస, పట్రువాడ వంతెనలను పూర్తిచేసి ప్రారంభించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని దత్తి పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు గారు వచ్చిన సందర్భంలో నియోజకవర్గానికి సార్వగడ్డ రిజర్వాయర్, మరివలస, జామి మండలం లో వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరడం జరిగిందని ముఖ్యమంత్రి వెంటనే వరాలు ప్రకటించడం జరిగిందన్నారు. పెండింగ్లో ఉన్న మర్రివలస వంతెన నిర్మాణం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు ప్రత్యేక దృష్టితో కేంద్ర ప్రభుత్వ సహకారంతో సాస్కి ప్రాజెక్ట్ నిధులను మంజూరు చేయటం జరిగిందన్నారు. తన తాత పైడితల్లి నాయుడు గారిని ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. 2004 ఎన్నికలలో అప్పటి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రమంతా వైయస్సార్ గాలి వీసినప్పటికీ ఎంపీగా తాతయ్య పైడితల్లి నాయుడు గెలుపొందటానికి నియోజకవర్గం ప్రజలే ముఖ్య కారణమన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు కావలసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అందించడం జరుగుతుందని, ప్రజలందరూ కూడా ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. అలాగే గ్రామ ప్రజల సౌకర్యార్థం గ్రామ పంచాయతీ భవనం కూడా నిర్మించడం జరిగిందన్నారు. గజపతినగరం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంవత్సరంలో పూర్తి చేయటంతో పాటు మంచి వైద్యులను ఏర్పాటు చేసి మెరుగైన చికిత్స అందించేలా చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఉన్న చిన్నారుల అందరిని కూడా తప్పనిసరిగా చదివించాలని, చదువు ద్వారానే మంచి భవిష్యత్తును పొందవచ్చని, చదువుకోవటం ద్వారా కుటుంబ జీవన విధానం మారుతుందని మంత్రి పిలుపునిచ్చారు. యువ నాయకులు నారా లోకేష్ గారు ఉద్యోగాల కల్పన కోసం అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావడం జరుగుతుందన్నారు. మెంటాడ, గజపతినగరం, పురిటిపెంట రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలో అంగన్వాడి, పాఠశాల భవనం శిథిలావస్థకు చేరినట్లు గ్రామస్తులు మంత్రి కొండపల్లి దృష్టికి తీసుకువెళ్లగా వచ్చే సంవత్సరానికల్లా భవన నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. మర్రివలస స్టేజ్ దగ్గర విద్యార్థుల కోసం బస్సు ఆగేలా ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికలలో ప్రజలకు మంచి చేస్తున్న కూటమి నాయకులను గెలిపించాలని అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి మాట్లాడుతూ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాటలు చెప్పరని, చేతలు చేసి చూపిస్తారని అనడానికి నిదర్శనమే ఈ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయటం అన్నారు. ఏఎంసీ చైర్మన్ పీవీవి గోపాల రాజు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని, కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. బిజెపి నాయకురాలు రెడ్డి పావని మాట్లాడుతూ దశాబ్దాల కలను సాకారం చేసిన ఘనత మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు దక్కుతుందన్నారు. మంత్రి ఎంతో ముందు చూపుతో వంతెన నిర్మాణానికి చిన్నారులతో రిబ్బన్ కట్ చేపించారని భావితరాల వారి భవిష్యత్తుకు నాంది పలకటం సంతోషంగా ఉందన్నారు. మక్కువ శ్రీధర్ మాట్లాడుతూ గత ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న చిరకాల స్వప్నమైన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయటం తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. పిఎసిఎస్ డైరెక్టర్ కుమార్ మాట్లాడుతూ రైతన్నల పంటల కోసం ఆంధ్ర రిజర్వాయర్ మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులు పలువురు మాట్లాడుతూ కలయో, నిజమో తెలియటం లేదని, మర్రివలస గ్రామ రాకపోకల సౌలభ్యం కోసం వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోతుందని అనుకున్నామని, వంతెన నిర్మాణంతో మా చిన్నారుల భవిష్యత్తులు మారడంతో పాటు, విద్య, వైద్యం కోసం రవాణా సదుపాయం వేగవంతంగా జరుగుతుందని ఆనంద భాష్పాలతో తెలిపారు. భక్తుల కోరిక నెరవేర్చిన దేవుడితో మా గ్రామ ప్రజలకు సమానమని మంత్రి కొండపల్లి నీ కొనియాడారు. కూటమి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు



# రైతన్నలకు మెరుగైన సేవలు అందించాలి

**మీసాల బాబాయ్ పేరు నిలబెట్టాలి**

**ఎత్తిపోతల పథకం చైర్మన్గా అంజి మూర్తి**

**చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్**

ఏలూరు జిల్లా, కామవరపుకోట, సెప్టెంబర్ 6, శ్రీ గంటా హనుమంతరావు ఎర్ర కాలవ ఎత్తిపోతల పథకం ద్వారా రైతన్నలకు మెరుగైన సేవలు అందించాలని సంఘ చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన కంఠమనేని అంజి మూర్తికి చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సూచించారు. ఎత్తిపోతల పథకం చైర్మన్గా వ్యవహరించే కంటమనేని సత్యనారాయణ (మీసాల బాబాయ్) ఇటీవల కాలంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో సంఘ ఉపాధ్యక్షులు మానుకొండ దేవసుతుడు అధ్యక్షతన ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆదేశాల మేరకు సమావేశమై సంఘ పరిధిలోని కంఠమనేని వారి గూడెం గ్రామానికి చెందిన కంఠమనేని అంజి మూర్తిని ఏకగ్రీవంగా చైర్మన్గా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ బాధ్యతలు చేపట్టిన అంజి మూర్తి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే రోషన్ కుమారును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ సంఘ పరిధిలో మీసాల బాబాయి పేరుకు దీటుగా పనిచేయడంతో పాటు, రైతన్నలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. చైర్మన్గా ఎన్నికైన అంజి మూర్తిని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణతో పాటు మండల టీడీపీ అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు ఘంటా మాధవరావు, రేగుంట సురేష్, గోరింక దాసు, బేతిన వెంకట్రావు, ఘంటా సత్యంబాబు, కొండూరి రాజా, ఎత్తిపోతల పథకం డైరెక్టర్లు, కూటమి నాయకులు అభినందించారు.



# పోటీ పరీక్షల యువతకు ఇండియన్ ఎకానమీ పుస్తకం ఉపయోగం

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

విజయనగరం, సెప్టెంబర్ 6, ప్రభుత్వ ఉద్యోగాల సాధన కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు 'ఇండియన్ ఎకానమీ పుస్తకం ఎంతో ఉ పయోగకరంగా ఉంటుందని

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రూప్-1, గ్రూప్-2తో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన అంశాలను సమగ్రంగా అందించేలా రూపొందించిన ఈ పుస్తకాన్ని ఆదివారం మంత్రి వారి కాంప్ కార్యాలయం లో ఆవిష్కరించారు. ఆర్. ఎస్. రెడ్డి సంస్థ ఆధ్వర్యంలో రూపొందిన ఈ పుస్తకాన్ని ఆర్. ఎస్. రెడ్డి ప్రచురణ సంస్థ ప్రచురించింది. ఈ పుస్తక నమూనా ఆర్ఎస్ రెడ్డి ఇన్స్టిట్యూట్ వెబ్సైట్ మరియు యూట్యూబ్ లలో లభ్యమౌతుందని పుస్తక రచయిత ఆర్ఎస్ రెడ్డి తెలిపారు. పోటీ పరీక్షల దృష్ట్యా అవసరమైన సమాచారాన్ని ఒకే చోట అందించడంతో పాటు పునశ్చరణ, పరీక్షల సన్నద్ధతకు ఉ పయోగపడేలా ఈ స్టడీ మెటీరియల్ ను రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లిశ్రీనివాస్ మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఇటువంటి సమయంలో వారికి అవసరమైన అంశాలను సమగ్రంగా అందించే నాణ్యమైన అధ్యయన సామగ్రిని పుస్తక రూపంలో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయ మన్నారు. అభ్యర్థులు ఆయా అంశాలపై విస్తృత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉ ద్యోగాల సాధనలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. వివిధ రంగాల్లోని ముఖ్యమైన అంశాలను పరీక్షల కోణంలో విశ్లేషిస్తూ అభ్యర్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పుస్తకాన్ని తీర్చిదిద్దారు.వేలాది మంది నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో వారికి ఉపయోగపడే విధంగా సమగ్ర స్టడీ మెటీరియల్ ను అందుబాటులోకి తీసుకురావడం మంచి ప్రయత్నమని మంత్రి ప్రశంసించారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పుస్తక రచయిత శ్రీ ఆర్ఎస్ రెడ్డి, మాజీ జడ్పిటిసి మక్కువ శ్రీధర్, డాక్టర్ వెలమల శ్రీనివాసరావు పాల్గొన్నారు





# కేసీఆర్ రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ మహా ధర్నా

- ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ నిరసన కార్యక్రమం
- ప్రతిపక్ష బాధ్యతలు నిర్వర్తించడం లేదని ఆరోపణ
- మంత్రి పొన్నం ప్రభాకర్ సహా పలువురు నేతల పాల్గొనడం
- ప్రజలకు జవాబుదారీతనం ఉండాలని కాంగ్రెస్ డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 6,

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడం, నియోజకవర్గ ప్రజల మధ్య పర్యటించకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తించకుండా పదవిలో కొనసాగడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, నియోజకవర్గ ప్రజల అభ్యర్థనలను వినడం వంటి బాధ్యతలు ప్రతి ఎమ్మెల్యేపై ఉంటాయని కాంగ్రెస్ నేతలు తెలిపారు. అయితే కేసీఆర్ ఈ బాధ్యతలను నిర్వర్తించడం లేదని ఆరోపిస్తూ ప్రజల తీర్పును గౌరవించి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్ష పాత్రలు రెండూ సమానంగా కీలకమని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు ప్రజల తరఫున సభలో గళం వినిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధి సభకు హాజరై ప్రజా సమస్యలపై మాట్లాడాలని, లేకపోతే ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని అన్నారు. ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూనే ప్రతిపక్ష వైఖరిని కూడా ప్రశ్నిస్తామని తెలిపారు. ప్రజా ప్రయోజనాల అంశాల్లో బాధ్యతాయుతమైన రాజకీయాలు అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధుల ప్రధాన కర్తవ్యమని గుర్తు చేశారు. మహా ధర్నాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి హాజరై ప్రతిపక్ష బాధ్యతలను నిర్వర్తించాలని, లేకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.



# రూ.32.40 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

- వరంగల్ పశ్చిమలో లబ్ధిదారులకు చెక్కుల అందజేత
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ
- వైద్య ఖర్చులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం
- ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి



హనుమకొండ, సెప్టెంబర్ 6,

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి కీలక పాత్ర పోషిస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా అనేక కుటుంబాలకు ఉపశమనం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 123 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.32.40 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం భారీ మొత్తంలో ఖర్చు చేసిన కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఒక పెద్ద అండగా నిలుస్తోందని చెప్పారు. వైద్య చికిత్సల కోసం అప్పులపాలయ్యే పరిస్థితులు రాకుండా ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహకారం అందిస్తోందని నాయిని రాజేందర్ రెడ్డి వివరించారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని ఈ పథకం మరింత బలోపేతం చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సామాన్య ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆరోగ్యం, విద్య, ఉపాధి, సంక్షేమం వంటి రంగాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని నాయిని రాజేందర్ రెడ్డి చెప్పారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ పథకాలను చేరవేసే బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, అర్హతకు ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందిన ఆర్థిక సాయంపై సంతోషం వ్యక్తం చేశారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ఈ సహాయం తమకు ఎంతో ఉపయుక్తంగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. సీఎం సహాయనిధి పథకం ద్వారా మరిన్ని కుటుంబాలు లబ్ధి పొందాలని వారు ఆకాంక్షించారు.



# ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్’ ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్ రాజర్షిషా

- డైట్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ
- ప్రక్రియ నిర్వహణ తీరుపై ఆరా
- మావలలో పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన
- అధికారులకు పలు సూచనలు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 6,

ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న డైట్ కళాశాలలో కొనసాగుతున్న ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్’ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారుల పనితీరును సమీక్షించారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. డైట్ కళాశాలలో కొనసాగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి ప్రక్రియ అమలుపై వివరాలు తెలుసుకున్నారు. ఓటరు నమోదులు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి దశను జాగ్రత్తగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఓటరు జాబితాల సవరణలో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ మావల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ చేపడుతున్న ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనుల ఏర్పాట్లను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలకమని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. నిర్మాణ పనులలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తరగతి గదులు, ఇతర మౌలిక వసతుల నిర్మాణం ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ జగదీశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం, పాఠశాల నిర్మాణ పనులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా కొనసాగుతున్నాయని వారు తెలిపారు.



# అనుచిత భాష వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాలా?

భారాస ఎల్పీ సమావేశ వివరాలను వెల్లడించిన హరీశ్‌రావు

హైదరాబాద్: ‘ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి అనుచిత భాష వాడుతున్నారు. అలాంటి గౌరవం లేని సభకు కేసీఆర్ వెళ్లాల్సిన అవసరం లేదు. సభ్య సమాజం తలదించుకొనే వ్యాఖ్యలతో జరుగుతున్న చర్చలో తెలంగాణ సాధించిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ పాల్గొనకూడదని భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏకగ్రీవంగా నిర్ణయించారు’ అని భారాస శాసన సభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు వెల్లడించారు. ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు లాంటి నేతలను సభలో అవమానిస్తే... వారు సమావేశాలను బహిష్కరించి, ప్రజాక్షేత్రంలో గెలిచి మళ్లీ ముఖ్యమంత్రులుగా అడుగుపెట్టారని, కేసీఆర్ కూడా అదేబాటలో మళ్లీ సీఎంగానే శాసనసభలో అడుగుపెడతారని స్పష్టంచేశారు. సోమవారం నుంచి ప్రారంభంకానున్న అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై భారాస అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లిలో ఆదివారం భారాస ఎల్పీ సమావేశం నిర్వహించారు. అనంతరం చర్చించిన వివరాలను పార్టీ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద, విజయుడు, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులతో కలిసి హరీశ్‌రావు మీడియాకు వెల్లడించారు. “కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను నిలువునా మోసం చేశారు. ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించడానికి కనీసం నెల రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నడపాలని బీఏసీ సమావేశంలో భారాస పక్షాన గట్టిగా డిమాండ్ చేయాలని నిర్ణయించాం.



# ఉప్పల్ నల్లచెరువుకు కొత్త రూపు

## రూపురేఖలు మార్చుకున్న ఉప్పల్ నల్లచెరువు

### నెలాఖరులోపు ప్రజలకు అందుబాటులోకి

### చెరువుల అభివృద్ధి పనులపై హైడ్రా దృష్టి

### తమ్మిడికుంట, సున్నం చెరువులను పరిశీలించిన కమిషనర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 6,**

నగరంలోని చెరువుల అభివృద్ధికి హైడ్రా చేపడుతున్న చర్యలు ఫలితాలను ఇస్తున్నాయి. ఒకప్పుడు మురికి కూపాలుగా, ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగునీరు, ముళ్లపొదలతో నిండిపోయి ప్రజలను భయపెట్టిన చెరువులు ఇప్పుడు సుందర విహార కేంద్రాలుగా రూపాంతరం చెందుతున్నాయి. చెత్తతో నిండిపోయిన ప్రాంతాలు జలకళతో కళకళలాడుతూ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తున్నాయి. ఇప్పటికే మూడు చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగా, మరో మూడు చెరువులు ఈ నెలాఖరులోపు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ఉప్పల్ నల్లచెరువు అభివృద్ధి పనులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆక్రమణల కారణంగా 52.30 ఎకరాలకు కుదించబడిన చెరువును హైడ్రా చర్యలతో 67.31 ఎకరాలకు విస్తరించారు. చెరువు చుట్టూ 2.4 కిలోమీటర్ల పొడవైన బండ్‌తో పాటు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. అన్ని వయసుల వారు సేదతీరేందుకు గజిబోలు, కూర్చునే ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువులోకి వరదనీరు సులభంగా చేరేందుకు ఇన్‌లెట్లు, నీరు నిండిన తర్వాత ఎలాంటి వరద ముప్పు లేకుండా ఔట్‌లెట్లను కూడా అభివృద్ధి చేశారు. చెరువుల పునరుద్ధరణలో భాగంగా ఆక్రమణల తొలగింపుపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. చెరువుల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి సడలింపు లేకుండా చర్యలు తీసుకుంటూ సహజ స్వరూపాన్ని పునరుద్ధరించే పనులు చేపట్టింది. పర్యావరణ పరిరక్షణతో పాటు నగరంలో వర్షాకాల వరద సమస్యలను తగ్గించేందుకు ఈ అభివృద్ధి కార్యక్రమాలు దోహదపడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం మాధాపూర్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువుల అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తమ్మిడికుంటలో పేరుకుపోయిన బయో వ్యర్థాలను పూర్తిగా తొలగించి, మురుగునీటిని నిర్మూలించి చెరువును అభివృద్ధి చేసిన తీరును పరిశీలించారు. చెరువుకు సమీపంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, వేర్వేరు చేసే కేంద్రాల వల్ల కాలుష్య ముప్పు ఉందని గుర్తించి వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. సున్నం చెరువు పరిసరాలను పరిశీలించిన కమిషనర్, చెరువుకు ఆనుకుని ఉన్న బండపై వ్యూ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు చుట్టూ మరింత పచ్చదనం పెంచి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ ప్రాంతాలు భవిష్యత్తులో నగరవాసులకు విశ్రాంతి కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. అంతకుముందు కృష్ణాకాంత్ పార్కు చెరువును కూడా కమిషనర్ పరిశీలించారు. రెండో విడతలో అభివృద్ధి చేస్తున్న 14 చెరువుల్లో ఇది ఒకటని పేర్కొన్నారు. ఈ చెరువు లోతు, విస్తీర్ణం పెరిగితే వరద నీటి నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, శ్రీనివాసనగర్, అమీర్‌పేట ప్రాంతాలకు వరద ముప్పును తగ్గించడంలో ఈ చెరువు అభివృద్ధి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.



# తెలంగాణలో 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు టెండర్లు

హైదరాబాద్: రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత వేగవంతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతులను భారీగా విస్తరించేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) కీలక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మొత్తం 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ కోసం ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్ల (సీపీఓలు) కోసం టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పెరుగుతున్న ఈవీ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ రంగం ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని రెడ్కో వీసీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ పేర్కొన్నారు. హైదరాబాద్ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిలోని పలు ప్రాంతాలను కవర్ చేస్తూ రెడ్కో సంస్థ ఏర్పాటు చేసిన 200 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఆరు క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన సీపీవోలు వీటి ఆపరేషన్, మెయింటెనెన్స్, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ బాధ్యతలను చేపడతారని, ప్రాజెక్టు కాంట్రాక్ట్ కాలం 10 సంవత్సరాలు ఉంటుందన్నారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని 16 ప్రాంతాల్లోనూ 169 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు.






# మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్‌ను వెంటనే ప్రవేశపెట్టాలి

### ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

### ప్రజలకు సౌకర్యంగా నెలవారీ, రోజువారీ పాస్‌ల జారీకి ఆదేశాలు

### పాతబస్తీ మెట్రో విస్తరణ పనులు వేగవంతం చేయాలని సూచన

### బేగంపేట్ మెట్రో భవన్‌లో సమన్వయ సమావేశం

### మెట్రోలో ప్రయాణించి సౌకర్యాల పరిశీలన

**హైదరాబాద్, సెప్టెంబర్ 6,**

హైదరాబాద్ నగర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రజా రవాణా సేవలు అందించేందుకు మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ సంయుక్త ప్రయాణ పాస్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. బేగంపేట్ మెట్రో రైల్ భవన్‌లో హైదరాబాద్ మెట్రో రైల్, టీజీఎస్ఆర్టీసీ, విద్యుత్ శాఖ, మెట్రో వాటర్‌వర్క్స్ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. ప్రజలకు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నెలవారీ, రోజువారీ ఉమ్మడి పాస్‌లను అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ బి. అజిత్ రెడ్డి, జాయింట్ ఎండీ శివేంద్ర ప్రతాప్ తదితరులు మెట్రో మొదటి, రెండో దశల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధాన కార్యదర్శికి వివరించారు. నగర రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలను ఆయనకు వివరించారు. మెట్రో విస్తరణ, ప్రయాణికుల సౌకర్యాల పెంపుపై జరుగుతున్న పనుల పురోగతిని కూడా వెల్లడించారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో కారిడార్ పనుల పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా ఆరా తీశారు. 7.5 కిలోమీటర్ల మేర ప్రతిపాదిత పాతబస్తీ మెట్రో విస్తరణకు సంబంధించిన రోడ్ల విస్తరణ, టెండర్ ప్రక్రియ, జనరల్ కన్సల్టెంట్ నియామకంపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ కీలక ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించాలని ఆదేశించారు. మెట్రో--ఆర్టీసీ ఉమ్మడి పాస్ అమలుపై ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైల్, టీజీఎస్ఆర్టీసీ అధికారులు తమ సాంకేతిక సన్నద్ధత గురించి వివరించారు. ఉమ్మడి పాస్ అమలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఎప్పుడైనా అమలు చేయగలమని అధికారులు ప్రధాన కార్యదర్శికి తెలిపారు. దీనిపై స్పందించిన సంజయ్ జాజు, ఉమ్మడి చార్జీల విధానాన్ని త్వరగా ఖరారు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమావేశానికి హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ ఎండీ కె. అశోక్ రెడ్డి, మెట్రో రైల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డీవీఎస్ రాజు, సీఎస్‌టీఈ స్వప్న కుమార్ దాస్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, జీఎం (ఫైనాన్స్) సూర్యప్రకాశం తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి శాఖల మధ్య సమన్వయం పెంచాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. సమావేశం అనంతరం ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బేగంపేట్ నుంచి పారడైజ్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మెట్రో స్టేషన్లలోని వాణిజ్య సముదాయాలు, పార్కింగ్ సదుపాయాలను పరిశీలించి మరింత అభివృద్ధి చేయాల్సిన అంశాలపై సూచనలు చేశారు. అలాగే ఎన్‌హెచ్-44పై హెచ్ఎండీఏ నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్లను కూడా పరిశీలించి సంబంధిత అధికారులతో పురోగతిపై చర్చించారు. నగర రవాణా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు.

# జనగామ మున్సిపాలిటీలో తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి రాత పరీక్ష నిర్వహణ

## 54 పోస్టులకు 126 దరఖాస్తులు

### 110 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో పరీక్ష

### పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహణ

**జనగామ, సెప్టెంబర్ 6,**

జనగామ మున్సిపాలిటీలో తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి ఆదివారం రాత పరీక్షను నిర్వహించారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో ఈ పరీక్ష పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగింది. మున్సిపాలిటీలో అన్‌స్కిల్డ్ శానిటేషన్ వర్కర్లు, ఎలక్ట్రీషియన్లు, హెవీ వెహికల్ డ్రైవర్ల పోస్టుల భర్తీ కోసం పరీక్ష నిర్వహించారు. అన్‌స్కిల్డ్ శానిటేషన్ వర్కర్లకు 30 పోస్టులు ఉండగా, 45 దరఖాస్తులు అందాయి. వీరిలో 34 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎలక్ట్రీషియన్ పోస్టులు నాలుగు ఉండగా, వాటికి 34 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 32 మంది పరీక్ష రాశారు. అలాగే హెవీ వెహికల్ డ్రైవర్ పోస్టులు 20 ఉండగా, 47 దరఖాస్తులు అందాయి. అందులో 44 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తంగా 54 పోస్టులకు గాను 126 దరఖాస్తులు అందగా, 110 మంది అభ్యర్థులు రాత పరీక్ష రాశారు. పరీక్ష నిర్వహణలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. నియామక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం, జనగామ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, ఉపాధి శాఖ అధికారి కుమారస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు. పరీక్ష విజయవంతంగా ముగియడంతో అభ్యర్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.









# ప్రత్యేక వనమహోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షిషా

### బంగారుగూడ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో మొక్కల నాటకం

### డిజిటల్ బోర్డును ప్రారంభించిన కలెక్టర్

### విద్యార్థులకు నూతన దుస్తుల పంపిణీ

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 6,**

ఆదిలాబాద్ పట్టణ శివారులోని బంగారుగూడ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల ఆవరణలో ఆదివారం ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కల సంరక్షణకు సంబంధించిన సూచనలు చేశారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ముఖ్యమని వివరించారు. కార్యక్రమం అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధునిక డిజిటల్ బోర్డును కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించారు. విద్యా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం విద్యార్థుల అభ్యాసాన్ని మరింత సులభతరం చేస్తుందని పేర్కొన్నారు. డిజిటల్ బోర్డుల ద్వారా పాఠ్యాంశాలను మరింత ప్రభావవంతంగా బోధించవచ్చని, విద్యార్థులలో సృజనాత్మకత, అవగాహన పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆధునిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నూతన దుస్తులను కూడా పంపిణీ చేశారు.



విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న సౌక ర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కలీం, వైస్ చైర్మన్ రోహిత్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, విద్యాభివృద్ధి అంశాలపై వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# సింగరేణి కార్మికుల హామీల అమలులో కాంగ్రెస్ విఫలం




### మంచిర్యాలలో సింగరేణి కార్మికుల సంరక్షణ సదస్సు

### పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దివాకర్‌రావు

### కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని ఆరోపణ

### ఎన్నికల హామీల అమలుకు డిమాండ్

**మంచిర్యాల, సెప్టెంబర్ 6,**

సింగరేణి కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో కూడా అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన శ్రీరాంపూర్ డివిజన్ సింగరేణి కార్మికుల సంరక్షణ సదస్సులో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దివాకర్‌రావు, సింగరేణి కార్మికులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. సదస్సులో మాట్లాడిన నాయకులు, సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. కార్మిక కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని, వారి కృషితోనే సంస్థ దేశంలో ప్రముఖ బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఎదిగిందని నాయకులు గుర్తు చేశారు. అలాంటి కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని విస్మరించడం బాధాకరమని అన్నారు. ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంపదను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, సంస్థ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంస్థను బలోపేతం చేసే నిర్ణయాలే తీసుకోవాలని సూచించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో అనేక చర్యలు చేపట్టిందన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని ఎప్పటికప్పుడు ప్రాధాన్యంగా తీసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం





వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సదస్సులో పాల్గొన్న కార్మికులు కూడా తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ అంశాలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని నిర్ణయించారు.



# బాసరలో రూ.20 కోట్లతో ఘాట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

### గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు శ్రీకారం

### గోదారమ్మకు జలహారతి ఇచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు

### భక్తుల సౌకర్యాల కోసం ఘాట్ల అభివృద్ధి

### విస్తృత స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

**నిర్మల్, సెప్టెంబర్ 6,**

గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసరలో చేపట్టనున్న ఘాట్ల నిర్మాణ, పునరుద్ధరణ పనులకు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులు పుష్కరాల సమయంలో వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో చేపడుతున్నారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గోదారమ్మకు జలహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాల్లో భాగమయ్యారు. గోదావరి పుష్కరాలు తెలంగాణకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆధ్యాత్మిక వేడుకలలో ఒకటని మంత్రి పేర్కొన్నారు. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు బాసరకు వచ్చే అవకాశముండటంతో ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ఘాట్ల అభివృద్ధితో పాటు ఇతర మౌలిక సదుపాయాల విస్తరణ పనులు కూడా చేపడుతున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పాత ఘాట్ల పునరుద్ధరణతో పాటు కొత్త ఘాట్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులు సులభంగా స్నానాలు ఆచరించేలా, రద్దీని సమర్థంగా నియంత్రించేలా ఆధునిక ప్రమాణాలతో ఘాట్లను అభివృద్ధి చేయనున్నారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉందన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, రవాణా, వైద్య సేవలు, విశ్రాంతి కేంద్రాలు వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. బాసరలో పుష్కర భక్తుల రద్దీకి అనుగుణంగా దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పుష్కరాల అనంతరం కూడా ఈ సదుపాయాలు యాత్రికులకు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. బాసర క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతున్న నేపథ్యంలో అవసరమైన అన్ని వసతులను కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# గణేష్ ఉత్సవాలకు ఆన్‌లైన్ అనుమతులు తప్పనిసరి

### మండపాల ఏర్పాటుకు చలానాలు అవసరం లేదు

### సింగిల్ విండో విధానంలో అన్ని శాఖల అనుమతులు

### భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

### శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలని ఎస్పీ పిలుపు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 5,**



ఈ నెల 14న నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో జిల్లాలో గణేష్ మండపాలు, పందిళ్లు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అమలు చేస్తున్న సింగిల్ విండో విధానం ద్వారా పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అనుమతులను ఒకే వేదికపై పొందవచ్చని తెలిపారు. నిర్వాహకులు తప్పనిసరిగా ganeshutsav.net వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసిన మండపాలకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ ఎన్‌ఓసీ జారీ చేయబడుతుందని వివరించారు. గణేష్ మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలానాలు లేదా ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రజలు లేదా నిర్వాహకులు ఎవరైనా అనవసరంగా డబ్బులు చెల్లించవద్దని, అలాంటి డిమాండ్లు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఉత్సవాల సమయంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ పేర్కొన్నారు. మండపాలను రహదారులపై ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ఏర్పాటు చేయాలని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు, నీటి డ్రమ్ములు, ఇసుక బస్తాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ అలంకరణలో నాణ్యమైన బీఐఎస్, ఐఎస్ఐ ప్రమాణాల పరికరాలనే వినియోగించాలని, ప్రమాదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధిక శబ్దం చేసే డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగాన్ని నిషేధించినట్లు ఎస్పీ తెలిపారు. స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలన్నారు. బాణసంచా కాల్చడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం, అశ్లీల ప్రదర్శనలు నిర్వహించడం వంటి చర్యలు పూర్తిగా నిషేధితమని హెచ్చరించారు. హుండీలు, విరాళాలు, విలువైన వస్తువుల భద్రత విషయంలో నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాల నిర్వహణలో కూడా కట్టుదిట్టమైన నిబంధనలు అమల్లో ఉంటాయని ఎస్పీ స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నిమజ్జన వాహనాల వివరాలు, డ్రైవర్ల లైసెన్స్ వివరాలు ముందుగానే సమర్పించాలని చెప్పారు. పోలీసు శాఖ సూచించిన మార్గాల్లోనే నిమజ్జన ఊరేగింపులు నిర్వహించాలని, నిర్ణీత సమయాల్లోనే కార్యక్రమాలు పూర్తి చేయాలని సూచించారు. రాత్రి 10 గంటలలోపు నిమజ్జనాలు ముగించాల్సి ఉంటుందని, నిమజ్జన ప్రాంతాల్లో చిన్నపిల్లలను అనుమతించవద్దని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలు, పర్యావరణహిత గణేష్ విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ కోరారు. ప్రతి గణేష్ మండపానికి సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి ఒక పోలీస్ కో-ఆర్డినేటర్‌ను నియమించి నిర్వాహకులతో సమన్వయం చేస్తామని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా, ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే డయల్ 112 లేదా వాట్సాప్ నంబర్ 6309990933 ద్వారా పోలీసులను సంప్రదించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, శాంతియుత వాతావరణంలో నిర్వహిస్తూ పోలీస్ శాఖకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల మంజూరు

### జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ మూడో దఫా సమావేశం

### దరఖాస్తుల పరిశీలనపై చర్చ

### పారదర్శకంగా అక్రిడిటేషన్ల మంజూరు: కలెక్టర్

**కాకినాడ, సెప్టెంబర్ 6,**

అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల మంజూరు ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ మూడో దఫా సమావేశం కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల నుంచి అందిన అక్రిడిటేషన్ దరఖాస్తులను సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు, అర్హత ప్రమాణాల ప్రకారం దరఖాస్తుల పరిశీలన చేపట్టి అక్రిడిటేషన్ల మంజూరుకు సంబంధించిన అంశాలపై చర్చించారు. మీడియా ప్రతినిధులు ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు న్యాయబద్ధంగా, పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు దరఖాస్తులపై తమ అభిప్రాయాలను వెల్లడించగా, నిబంధనలకు అనుగుణంగా తుది నిర్ణయాలు తీసుకున్నారు. జర్నలిస్టుల వృత్తిపరమైన అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోందని అధికారులు వెల్లడించారు. సమావేశంలో కమిటీ సభ్యులు, సమాచార శాఖ అధికారులు మరియు సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.



# అవికా గోర్‌కు

## ఎయిర్‌పోర్ట్‌లో వింత అనుభవం!

ముంబయి, సెప్టెంబర్ 06

'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటి అవికా గోర్‌కు ఇటీవల ఎయిర్‌పోర్ట్‌లో ఓ సరదా సంఘటన ఎదురైంది. ఆమెను కలిసేందుకు వచ్చిన అభిమానుల ఉత్సాహాన్ని చూసిన కొందరు విదేశీయులు.. అసలు అక్కడ ఏం జరుగుతుందో తెలియక అవికాపై ఎవరో దాడి చేస్తున్నారని భావించి కంగారుపడ్డారు. ఈ ఆసక్తికరమైన విషయాన్ని అవికా స్వయంగా సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. ఇటీవల ఎయిర్‌పోర్ట్‌లో అవికా గోర్ వద్దకు ముగ్గురు యువతులు వచ్చారు. ఆమెతో కలిసి ఫొటోలు దిగడంతో పాటు.. తన నటన తమ జీవితాలపై చూపిన ప్రభావాన్ని వివరించారు. కేవలం అభిమానిగా ఫొటో తీసుకోవడం మాత్రమే కాకుండా.. తన కళను, నటనను ఇంతకాలం గుర్తుంచుకుని ప్రశంసించడం అవికాను భావోద్వేగానికి గురిచేసింది. అయితే ఈ సమయంలో అక్కడే ఉన్న కొందరు యూరోపియన్లు మాత్రం ఆ దృశ్యాన్ని చూసి మరోలా అర్థం చేసుకున్నారు. అభిమానులు అవికా చుట్టూ చేరి మాట్లాడుతున్న తీరు, హడావుడిని చూసి ఆమెకు ఏదైనా ఇబ్బంది ఎదురవుతోందని భావించారు. ఎవరో యువతిపై దాడి చేస్తున్నారని అనుకుని ఆందోళన చెందినట్లు అవికా సరదాగా వెల్లడించారు. ఈ ఘటనను వివరిస్తూ అవికా తన సామాజిక మాధ్యమాల కథనంలో భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. ఎయిర్‌పోర్ట్‌లో తనను కలిసిన ముగ్గురు యువతులు.. ఇన్నేళ్లుగా తాను సంపాదించుకున్న అభిమానాన్ని మరోసారి గుర్తుచేశారని తెలిపారు. చిన్న వయసు నుంచే తన ఫొటోలు తీసుకునే అభిమానులను చూస్తున్నప్పటికీ.. తన నటన, కళ పట్ల వారికి ఉన్న గౌరవాన్ని స్వయంగా వినడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. నటులుగా తాము ఎన్నో కష్టాలు పడటానికి ప్రధాన కారణం ప్రేక్షకుల నుంచి లభించే ఇలాంటి ప్రేమ, గుర్తింపేనని అవికా తెలిపారు. అభిమానులు తమ కళను గుర్తించి, తమ నటన తమ జీవితాల్లో ఏదో ఒక మార్పు తీసుకొచ్చిందని చెప్పడం తన మనసును తాకిందని ఆమె పేర్కొన్నారు. అదే సమయంలో అక్కడ జరిగిన అపార్థాన్ని కూడా అవికా సరదాగా ప్రస్తావించారు. తన చుట్టూ అభిమానులు చేరిన సమయంలో తాను ఇబ్బందుల్లో ఉన్నానని భావించిన విదేశీయులకు.. అసలు విషయం ఏమిటో తన సామాజిక మాధ్యమాల ద్వారా చెబుతున్నానని పేర్కొన్నారు. దీంతో ఆమె పంచుకున్న ఈ సంఘటన ప్రస్తుతం అభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తోంది. ఇదిలా ఉండగా.. అవికా గోర్ ఇటీవలే ప్రముఖ సాహస విన్యాసాల ఆధారిత రియాలిటీ కార్యక్రమం 'ఖత్రోన్ కే ఖిలాడీ 15' నుంచి నిష్క్రమించారు. సామాజిక మాధ్యమాల ప్రభావశీలి ఓరీతో జరిగిన ఓ విన్యాసంలో ఓడిపోవడంతో ఆమె కార్యక్రమం నుంచి ఎలిమినేట్ అయినట్లు సమాచారం. సీరియల్స్‌తో పాటు సినిమాలు, రియాలిటీ కార్యక్రమాల్లోనూ తన ప్రత్యేకతను చాటుకుంటున్న అవికా గోర్.. ప్రస్తుతం వరుస అవకాశాలతో ముందుకు సాగుతున్నారు.

# మహిళల్ని అలా చూపించడంపై కయాదు నో!

హైదరాబాద్, సెప్టెంబర్ 06

'డ్రాగన్' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న యువ నటి కయాదు లోహర్ ప్రస్తుతం తెలుగు, తమిళ చిత్రాలతో బిజీగా ఉన్నారు. తెలుగులో 'అల్లూరి', 'ఫంకీ' చిత్రాల్లో నటించిన ఆమె.. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ది పారడైజ్' సినిమాలో కథానాయికగా నటిస్తున్నారు. మరోవైపు సామాజిక మాధ్యమాల్లోనూ చురుగ్గా ఉండే కయాదు.. తాజాగా సినిమాల్లో మహిళల్ని చూపించే విధానంపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. సినిమాల్లో మహిళలను కేవలం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే అంశంగా చూపించే విధానాన్ని తాను అంగీకరించనని కయాదు స్పష్టం చేశారు. కథ, పాత్రకు అవసరమైతే.. ఆ పాత్ర పరిధిలో నటించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. అయితే కేవలం ప్రచారం కోసం, ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం కోసం లేదా సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం కోసం అసభ్యకరమైన సన్నివేశాల్లో నటించే ఆలోచన తనకు లేదని పేర్కొన్నారు. ఒక పాత్రలో నటించేటప్పుడు కథకు, పాత్ర స్వభావానికి ప్రాధాన్యం ఇవ్వాలని కయాదు అభిప్రాయపడ్డారు.



# మహిళా చిత్రాలపై తాప్సీ సంచలన వ్యాఖ్యలు!

ముంబయి, సెప్టెంబర్ 06

మహిళా ప్రధాన చిత్రాలపై బాలీవుడ్ నటి తాప్సీ పన్ను చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పెద్ద కథానాయికలు నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోతే.. ఆ ప్రభావం తర్వాత వచ్చే మహిళా ప్రధాన చిత్రాలపై కూడా పడుతుందని తాప్సీ అభిప్రాయపడ్డారు. ఇటీవల అలియా భట్ నటించిన 'ఆల్ఫా' సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఫలితాన్ని అందుకోకపోవడం గురించి ప్రస్తావించిన తాప్సీ.. ఇలాంటి పరిణామాలు ఇతర మహిళా కథానాయికల చిత్రాల అవకాశాలను కూడా ప్రభావితం చేసే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఒక పెద్ద కథానాయిక సినిమా విఫలమైనప్పుడు ఆ ప్రభావాన్ని కేవలం ఆ చిత్రానికే పరిమితం చేయకుండా.. మొత్తం మహిళా ప్రధాన సినిమాలపై అనుమానంతో చూసే పరిస్థితి ఏర్పడుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.







# మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం!

హైదరాబాద్, సెప్టెంబర్ 06

జానపద పాటలు, నృత్యాలతో తెలుగు ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చుకున్న నటి, గాయని మాధురి రాథోడ్ జీవితంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. తోటి జానపద కళాకారుడు ఈశ్వర్ సాయితో కొంతకాలంగా కొనసాగుతున్న వివాదం నేపథ్యంలో తీవ్ర మనోవేదనకు గురైన ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు సకాలంలో గుర్తించి ఆమెను రక్షించడంతో ప్రాణాపాయం తప్పినట్లు తెలుస్తోంది. మాధురి రాథోడ్, ఈశ్వర్ సాయిల మధ్య వ్యక్తిగత వివాదానికి సంబంధించిన అంశాలు కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో తనకు అన్యాయం జరిగిందని మాధురి ఆరోపించారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని ఆమె గతంలో ఈశ్వర్ సాయిపై ఆరోపణలు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై ఆమె పోలీసులను ఆశ్రయించి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినట్లు తెలుస్తోంది. ఫిర్యాదు చేసినప్పటికీ తనకు న్యాయం జరగడం లేదని మాధురి తీవ్ర ఆవేదనకు గురైనట్లు సమాచారం. ఈశ్వర్ సాయిపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు జాప్యం చేస్తున్నారని ఆమె అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈశ్వర్ సాయి కూడా తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా స్పందించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే మాధురి తన నివాసంలో తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే అప్రమత్తమయ్యారు.

# సంగీత్ శోభన్ కొత్త సినిమా!

హైదరాబాద్, సెప్టెంబర్ 06

యువ కథానాయకుడు సంగీత్ శోభన్ వరుసగా విభిన్నమైన కథలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. తాజాగా మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. మలయాళ నటి అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాకు 'అంతా రాములోరు చూసుకుంటారు' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను చిత్రబృందం ప్రకటించింది. టైటిల్‌తో పాటు విడుదల చేసిన ప్రచార వీడియో సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో సంగీత్ శోభన్ మారుతి పాత్రలో కనిపించనుండగా.. అనస్వర రాజన్ శిరీషగా ప్రేక్షకులను పలకరించనుంది. సాధారణ ప్రేమకథలకు భిన్నంగా ఈ ఇద్దరి మధ్య జరిగే ఓ అందమైన సంభాషణ చుట్టూ కథ సాగనున్నట్లు ప్రచార వీడియో ద్వారా సంకేతాలు ఇచ్చారు. అయితే చిత్రబృందం మాత్రం దీనిని 'ప్రేమకథ కాదు' అనే ఆసక్తికరమైన భావనతో ప్రచారం చేస్తోంది. దీంతో మారుతి, శిరీషల మధ్య అసలు సంబంధం ఏమిటి? వారి జీవితాల్లో ఎలాంటి మలుపులు చోటుచేసుకుంటాయి? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. అందమైన గోదావరి ప్రాంతాన్ని నేపథ్యంగా తీసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అక్కడి పల్లెటూరి వాతావరణం, సంస్కృతి, సహజమైన అందాలను కథలో భాగంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ నేపథ్యానికి అనుగుణంగా సహజమైన భావోద్వేగాలు, ఆహ్లాదకరమైన సన్నివేశాలు, పాత్రల మధ్య అనుబంధాన్ని ప్రధానంగా చూపించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. 'కుమారి 21ఎఫ్' చిత్రంతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న పల్నాటి సూర్య ప్రతాప్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. విభిన్నమైన కథను తనదైన శైలిలో ప్రేక్షకులకు అందించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్ ప్రకటన సందర్భంగా విడుదల చేసిన ప్రచార వీడియోలో కనిపించిన దృశ్యాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి.




"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467